
సాక్షి ఒడిశా

శుక్రవారం । 19 । జనవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,17,784లు, బంగారం 6గ్రాము 300 మిల్లీగ్రాములు, వెండి 267గ్రాములు 400 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.




పూరీకి బస్సు సేవలు

రాష్ట్రం నలుమూలల నుంచి పవిత్ర పుణ్యక్షేత్రం పూరీకి వచ్చిపోయేందుకు రాష్ట్ర ప్రభుత్వం బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించింది.

- 8లో

వారసత్వ ప్రాకారంలో 108 అడుగుల అగరుబత్తి

పూరీ శ్రీమందిర్ వారసత్వ ప్రాకార ప్రాంగణంలో అత్యంత పొడవాటి అగరుబత్తి వెలుగుతోంది.



- 8లో

న్యూస్‌రీల్

అక్రమంగా తరలిస్తున్న మద్యం సీజ్



అరెస్టైన వ్యక్తులను చూపిస్తున్న పోలీసులు

బరంపురం: కొందమాల్ జిల్లా ఘుచ్చపడా నుంచి గంజాం జిల్లా బంజనగర్ వైపు కారులో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఐఐసీ అధికారి మనోజ్ కుమార్ పూజారి తెలిపిన వివరాల మేరకు.. మద్యం తరలిస్తున్నట్లు బుధవారం ముందస్తు సమాచారం అందుకున్న పోలీసులు తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఘుచ్చపడా జంక్షన్ దగ్గర కారుపై దాడులు నిర్వహించి మద్యంతో పాటు కారును సీజ్ చేశారు. అలాగే కారు డ్రైవర్‌తో పాటు మరో నిందితుడిని అరెస్టు చేశారు. అరెస్టైనవారు పిరింగియా పంచాయతీకి చెందిన సాదీన్ సాహు, సాంబు బెహరాలుగా నిర్ధారించారు.

టైరు పేలడంతో ట్రక్ బోల్తా



బోల్తాపడిన ట్రక్

బరంపురం: గంజాం జిల్లా దిగపండి పోలీసుస్టేషన్ పరిధి డెంగపదర గ్రామ సమీపంలోని 59వ జాతీయ రహదారిపై టైరు పేలడంతో ట్రక్ బోల్తాపడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసు అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని ట్రక్‌లో డ్రైవర్ మృతదేహాన్ని బయటకు తీశారు. డ్రైవర్ నయాగడా జిల్లాకి చెందిన లోక్‌నాథ్ సాహుగా గుర్తించారు. క్లీనర్‌ను రక్షించి చికిత్స కోసం దిగపపండి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోదాములపై అధికారుల దాడులు



దుకాణాలు వద్ద బంగాళదుంపలు పరిశీలిస్తున్న అధికారులు


బరంపురం: నగరంలోని బంగాళ దుంపల గోదాములపై జిల్లా పౌర సరఫరా అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. రాష్ట్రంలో బంగాళదుంపల ధరలు పెరగడంతో పెద్ద బజార్‌లోని హోల్‌సేల్ దుకాణాలు, గోదాముల్లో ఆకస్మిక దాడులు చేసి బిల్లింగ్‌కు సరిపడా స్టాక్ ఉందో లేదో పరిశీలించారు. అదేవిధంగా నియమిత ధర కంటే ఎక్కువ ధరకు విక్రయాలు చేయవద్దని స్పష్టం చేశారు. హోల్‌సేల్, రిటైల్ దుకాణాల్లో నియమిత ధరలతో బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

త్వరలో నాట్య మండపం పనులు పూర్తి

భువనేశ్వర్: పూరీలో శ్రీజగన్నాథ దేవాలయ సముదాయం నాట్య మండపం, జగమోహన్ మండపాల మరమ్మతుల పనులు అతి త్వరలో పూర్తవుతాయని భారతీయ పురావస్తు శాఖ (ఏఎస్ఐ) సమాచారం. ఈ ఏడాది ఏప్రిల్ 30 నాటికి పూర్తవుతాయని ఒడిశా హైకోర్టుకు గురువారం ఈ సమాచారం అందజేసింది. భారతీయ పురావస్తు శాఖ ఆధ్వర్యంలో శ్రీమందిరంలో కొనసాగుతున్న ఈ నిర్మాణాల పనులు ఏప్రిల్ 30 నాటికి పూర్తవుతాయని అమికస్ క్యూరీ ఎం.కె.మహంతి హైకోర్టుకు మౌఖికంగా తెలియజేశారు. ఈ నేపథ్యంలో వారంలోగా దీనికి సంబంధించి అఫిడవిట్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ కేసులో తదుపరి విచారణ వచ్చే వారంలో జరగనుంది. మరమ్మతుల పనులకు సంబంధించి బీమ్ డిజైన్ ఇప్పటికే ఖరారైందని అమికస్ క్యూరీ కోర్టుకు తెలిపారు. ఇంతకుముందు 2023 సంవత్సరం నవంబర్ నెలలో పుణ్యక్షేత్రం పూరీ శ్రీమందిరం పునరుద్ధరణ పనుల్లో జాప్యంపై రాష్ట్ర హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. హైకోర్టు స్పందనతో భారతీయ పురావస్తు శాఖ ఏఎస్ఐ నవంబర్ 16 నుంచి మరమ్మతులు, పునరుద్ధరణ పనులను ముమ్మరం చేసింది. ఈ క్రమంలో శ్రీ మందిరం పునరుద్ధరణ ఇతరేతర నిర్వహణ కార్యకలాపాలు నిర్వహించేందుకు శ్రీ జగన్నాథ ఆలయ అధికార వర్గం (ఎస్‌జేటీఏ) ఏఎస్‌ఐకి అన్నివిధాలా సహకారం అందజేయాలని హైకోర్టు ఆదేశించింది. ప్రతీ 15 రోజులకోసారి కోర్టుకు తాజా నివేదికలు సమర్పిస్తారని హైకోర్టు పేర్కొంది.

కదలని.. కుమ్మరి చక్రం..!





అప్పుడే తయారైన మట్టి కుండలు

రొండాలో కుండలు తయారు చేస్తున్న బైరాగి పాత్రో

- పూట గడవడం కష్టంగా మారుతున్న వైనం
- ప్రభుత్వం నుంచి అందని సాయం

బరంపురం:

గంజాం జిల్లాలో ఒకప్పుడు కుమ్మరి వృత్తికి సాటిలేదు. అప్పట్లో మట్టి కుండలకు గిరాకీ ఉండడంతో సాఫీగా జీవనం సాగించేవారు. కానీ ప్రస్తుతం కులవృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న కుమ్మర్ల జీవితాల్లో వెలుగులు కనిపించడం లేదు. గంజాం జిల్లాలోని రొంగాయిలోండా, చికిటీ, కుకుడాఖండి సమితి పరిధిల్లోని గ్రామాల్లో కుమ్మరి వృత్తిపై ఆధారపడి సుమారు వెయ్యి కుటుంబాలు నివసిస్తున్నాయి. అయితే క్రమేపీ వీరి పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది.

గతమెంతో ఘనం

గతంలో గ్రామీణ ప్రాంతాల్లో మట్టి కుండల వినియోగం అధికంగా ఉండేది. ధాన్యం నిల్వచేసే గోదాముల నుంచి వంటచేసే పాత్రల వరకు మట్టితో చేసినవే వినియోగించేవారు. దీంతో కుమ్మరి చక్రం తిరుగితే చాలు, వారి ఇంట్లో తిండికి కొదవుండదన్న భరోసా ఉండేది. కానీ కాలక్రమేపీ మట్టిపాత్రలు మట్టిలో కలిసిపోవడంతో ఆ వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్న వారి పరిస్థితి దయనీయంగా మారింది. కొన్నేళ్ల క్రితం వరకు వేసవికాలంలో మంచి నీటిని నిల్వ ఉంచేందుకు మట్టి కుండలు వాడేవారు. కానీ ప్రస్తుతం టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో వేసవిలో సైతం అంతగా విక్రయాలు జరగడం లేదని రొంగాయిలోండా సమితి పరిధి రొండా గ్రామానికి చెందిన బైరాగి పాత్రో తెలియజేస్తున్నారు. కుల వృత్తి దెబ్బ తినడంతో వలసలు వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే కొంతమంది మాత్రం కుల వృత్తిని వదులుకోవడం లేదని చికిటీ సమితి పరిధిలోని కోటిలింగాల గ్రామానికి చెందిన సూర్యనారాయణ దాస్ తెలియజేస్తున్నారు. ప్రభుత్వం తమపై దయతలచి ఆదుకోవాలని కోరుతున్నారు.



అమ్మకానికి సిద్ధమైన కుండలు



కుండల తయారీలో మహిళ

50 కేజీల గంజాయి పట్టివేత



జయపురం: పట్టుబడిన నిందితులతో పోలీసులు

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ పోలీసులు రెండు స్కూటీల్లో తరలిస్తున్న గంజాయిని పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. బుధవారం సాయంత్రం మాచ్‌ఖండ్ ప్రాంతం నుంచి బొయిపరిగుడ సమితి గొలభొట గ్రామం మీదుగా గంజాయి అక్రమంగా రవాణా అవుతున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో బొయిపరిగుడ పోలీసుస్టేషన్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న బత్రిపుట్ కూడలి వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో రెండు స్కూటీలపై ముగ్గురు వ్యక్తులు వస్తుండగా పోలీసులకు అనుమానం వచ్చి వారిని ఆపారు. అనంతరం రెండు స్కూటీలను తనిఖీ చేయగా, వాటి డిక్కీల్లో గంజాయి పట్టుబడింది. వెంటనే గంజాయిని సీజ్ చేసి, ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. అరెస్టైన వారిలో నవరంగపూర్ జిల్లా తెంతులికుంటి ప్రాంతానికి చెందిన కుమార్ పాత్రోబాగ్, కుంభకర్ణ సౌర, భగవాన్ సాహులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. పట్టుబడిన గంజాయి తూకం వేయగా 50 కేజీలు ఉందని పేర్కొన్నారు. గంజాయిని నవరంగపూర్ జిల్లాకు తీసుకెళ్తున్నట్లు చెప్పారు.

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి ముండగూడ పంచాయతీ క్యెంగ్ గ్రామ సమీపంలో ఐసీసీ దేవ్‌దత్త ఆధ్వర్యంలో బుధవారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో ఒక బైక్ అతివేగంగా రావడంతో చూసి ఆపే ప్రయత్నం చేశారు. దీంతో అది గమనించిన నిందితుడు రెండు గంజాయి బస్తాలను రోడ్డుపైనే వదిలి పోలీసులకు దొరకకుండా అడవిలోకి పారిపోయాడు. అందులో 60 కేజీల గంజాయిని గుర్తించి సీజ్ చేశారు. అలాగే గురువారం ఉదయం ఛలాన్‌గూడ గ్రామం వద్ద ఒక వ్యక్తి బ్యాగ్‌లో గంజాయితో బస్సు కోసం ఎదురు చూస్తున్నట్లు ముందస్తు సమాచారం వచ్చింది. దీంతో మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్ కీడో తన సిబ్బందితో వెళ్లి నిందితుడిని అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బ్యాగ్‌లో ఉన్నటువంటి 25 కేజీలు గంజాయిని సీజ్ చేశారు. నిందితుడు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శుభం శర్మగా పేర్కొన్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు.



మల్కన్‌గిరి: మత్తిలి పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

కళలను పరిరక్షించుకోవాలి



శిక్షణ శిబిరం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే తారాప్రసాద్ తదితరులు

- ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి

జయపురం: మన ప్రాచీన కళలు, సాంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపై ఉందని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. సమితి కార్యాలయ సభాగృహంలో బ్లాక్ పరిధి కళా, సంస్కృతి సంఘం సభ్యులకు ఒక్కరోజు శిక్షణ శిబిరం గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కళలను పరిరక్షించుకుంటేనే మనకు మనుగడ ఉంటుందన్నారు. కనుమరుగవుతున్న కళలను పరిరక్షించుకునేందుకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బీడీవో శక్తి మహాపాత్రో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ జనహిత పథకంలో భాగంగా లోక కళల ద్వారా ప్రజలను చైతన్యపరచడమే శిబిరం ప్రధాన లక్ష్యమన్నారు. ఫిబ్రవరి 20వ తేదీ వరకు జయపురం సమితిలోని 22 గ్రామ పంచాయతీల్లో ప్రతీ గ్రామానికి వెళ్లి ప్రజలను చైతన్యపరచేందుకు అవసరమైన శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు. శిబిరంలో సమితి చైర్‌పర్సన్ తిలోత్తమ ముదులి, అదనపు బీడీవో మనోజ్ నాయక్, సమితి సామాజిక సురక్షా అధికారి కె.ఎస్.నిశా, జిల్లా స్వతంత్ర అభివృద్ధి పరిషత్ సభ్యుడు టంక్‌ధర హల్వ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు లక్ష్మీబాబా పయనం



లక్ష్మీబాబాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే కోడూరు

పర్లాకిమిడి: యూపీలోని అయోధ్యలో ఈనెల 22న జరగనున్న రామ మందిరం ప్రారంభోత్సవానికి గజపతి జిల్లా మహేంద్రగిరి సురక్ష సమితి భాస్కర తీర్థ లక్ష్మీబాబాకు ఆహ్వానం అందింది. దీంతో ఆయన గురువారం సాయంత్రం అయోధ్యకు రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనకు రైల్వేస్టేషన్ వద్ద పర్లాకిమిడి ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు, బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు అరుణిమా సాహు పుష్పగుచ్ఛాలు అందించారు. విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్షుడు కైలాష్ పట్నాయక్, దేవీ మఠం మహాంతలు బాజాభజంత్రీలతో ఆయనను రైల్వేస్టేషన్ వద్దకు తీసుకెళ్లారు.

సమాజానికి ఉపయోగపడే వార్తలకు ప్రాధాన్యమివ్వాలి



మాట్లాడుతున్న కుహరో వేదికపై సంజయ్, బసంత్ తదితరులు

రాయగడ: సమాజానికి ఉపయోగపడే వార్తలకు ప్రాధాన్యమివ్వాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి నిహారి రంజన్ కుహరో అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పిరామిల్ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ గురువారం నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోవిడ్ ముందు, ఆ తర్వాత పరిస్థితులను పరిశీలిస్తే పత్రికలు చదివేవారి సంఖ్య గణనీయంగా పడిపోవడంతో పాటు సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారం ఎక్కువగా దొర్లుతోందని అభిప్రాయం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం దినపత్రికలు చదివే పాఠకుల సంఖ్య పెరిగిందన్నారు. వారు ప్రాంతీయ వార్తలను చదివేందుకు ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారని పేర్కొన్నారు. పిరామిల్ ఫౌండేషన్ వారు మునిగుడ, పద్మపూర్ సమితుల్లో ప్రజా చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం, సామాజిక సురక్ష, బాల్య వివాహాల నిర్మూలన, విద్యార్థుల డ్రాపౌట్‌లను తగ్గించేందుకు విస్తృతంగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. పిరామిల్ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ నరేష్ శర్మ ఆధ్యక్షతన జరిగిన సదస్సులో సంస్థ ముఖ్య అధికారి సంజయ్ కుమార్ సింగ్ మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం కార్యక్రమాలు చేపట్టిన అనంతరం జరిగిన మార్పులను వివరించారు. సమావేశంలో జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి బసంతకుమార్ ప్రధాన్, జిల్లా అదనపు విద్యాశాఖ అధికారి భజన్‌లాల్ మాఝి తదితరులు పాల్గొన్నారు.

‘సాగర్‌కు పూర్వ వైభవం కల్పించాలి’

జయపురం:

సబ్ డివిజన్ పరిధి కోట్‌పాడ్‌లో చారిత్రాత్మక దమయంతి సాగర్‌కు పూర్వ వైభవం కల్పించేందుకు అభివృద్ధి చేయాలని కోట్‌పాడ్ మో దమయంతి సాగర్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ కమిటీ అధ్యక్షుడు బాలకృష్ణ ఖడంగా నేతృత్వంలో కమిటీ సభ్యులు కోట్‌పాడ్ తహసీల్దార్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దమయంతి సాగర్‌ను పట్టించుకోకపోవడంతో కాలక్రమేపీ ఆక్రమణలకు లోనవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 110 ఎకరాల్లో రాజులు తీయించిన సాగర్ ప్రస్తుతం 83 ఎకరాలకు పరిమితమైందని వాపోయారు. మిగతా 27 ఎకరాలు ఆక్రమణలకు గురైన విషయం ఇదివరకే తాము తెలియజేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఒడిశా ప్రభుత్వం దమయంతి సాగర్ సుందరీకరణకు నిధులు మంజూరు చేసిందని, ఆ నిధులతో చారిత్రాత్మక సాగర్‌ను అందంగా తీర్చిదిద్దాలని కోరారు. తహసీల్దార్‌ను కలిసినవారిలో సంఘం సలహాదారు గణేష్ చంద్ర సాహు, కార్యదర్శి గౌరీప్రసాద్ రథ్, ఉపాధ్యక్షుడు గంగాధర్ సామల్, సహాయ కార్యదర్శి గౌరీప్రసాద్ పట్నాయక్ తదితరులు ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం సభ్యులు

ఎయిర్ స్ట్రిప్ నిర్మిస్తే మరింత అభివృద్ధి

- సెంచూరియన్ వర్శిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.ఎస్.రావు

పర్లాకిమిడి: గజపతి జిల్లా కేంద్రంలో ఎయిర్ స్ట్రిప్ నిర్మిస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని సెంచూరియన్ వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.ఎస్.రావు అన్నారు. స్థానిక టౌన్ హాల్‌లో గురువారం జరిగిన ప్రథమ ప్రెస్‌క్లబ్ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీకాకుళం జిల్లాలో భావనపాడు పోర్టును ఆ ప్రభుత్వం త్వరితగతిన అభివృద్ధి చేస్తోందన్నారు. అలాగే విజయనగరం జిల్లాలో భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మిస్తున్నట్లు తెలియజేశారు. వీటికి అనుబంధంగా పర్లాకిమిడి శివారులో ఒడిశా ప్రభుత్వం ఎయిర్ స్ట్రిప్ నిర్మిస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అనంతరం ఎంపీ చంద్రశేఖర సాహు ప్రెస్‌క్లబ్ అదనపు భవన నిర్మాణానికి రూ.5 లక్షలు, ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు రూ.5 లక్షలు కేటాయించారు. అలాగే భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అదేవిధంగా ఎంపీ చంద్రశేఖర సాహు చేతులమీదుగా ఔత్సాహిక జర్నలిస్టు కుమారి శక్తి స్వరూప పట్నాయక్, బరంపురం (సోకాలో) జర్నలిస్టు శక్తిధర రాజగురుకు మొమెంటోతో సత్కరించారు. కార్యక్రమానికి ప్రెస్‌క్లబ్ ఆర్గనైజర్ ద్విజేంద్ర నాథ్ పాడి అధ్యక్షత వహించగా, ముఖ్యవక్తగా ఆదర్శదాస్ వ్యవహరించారు. అనంతరం ఒడిస్సీ, సంబల్‌పురి కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మోహనా ఎమ్మెల్యే దాశరథి గోమాంగో, అదనపు జిల్లా కలెక్టర్ (రెవెన్యూ) బీరేంద్ర కుమార్ దాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ నిర్మలా శెఠి, సబ్ డివిజనల్ పోలీసు అధికారి మాధవనంద నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఆచార్య డి.ఎస్.రావుకు జ్ఞాపిక అందజేస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు



కళాకారుల ఒడిస్సీ నృత్య ప్రదర్శన

క్లుప్తంగా

మత్స్యకారులకు చిక్కిన డాల్ఫిన్



డాల్ఫిన్‌ను మోసుకెళ్తున్న మత్స్యకారులు

భువనేశ్వర్: బాలాసోర్ జిల్లాలోని బొస్తా ప్రాంతం జలకా నదిలో మత్స్యకారులు గురువారం అరుదైన డాల్ఫిన్‌ను పట్టుకున్నారు. అనంతరం బొస్తా మండలం నౌలొబహార్ గ్రామం చెరువులో దీనిని విడిచిపెట్టారు. మత్స్యకారులకు చిక్కిన డాల్ఫిన్ 25 కిలోల పైబడి బరువు ఉందని సమాచారం. 6 అడుగుల పొడవున్న డాలిఫ్సిన్‌ను తమ భుజాలపై మోసుకెళ్లి గ్రామ చెరువులో వదిలారు. ఈ సమాచారం అందడంతో అటవీ శాఖ అధికారులు గ్రామానికి చేరుకుని చెరువులో ఉన్న డాల్ఫిన్‌ను రక్షించారు. ఆ తర్వాత దాన్ని సముద్రంలో వదిలేందుకు తీసుకెళ్లారు. నౌలొబహార్ గ్రామ సమీపంలోని జలకా నదిలో ఈ డాల్ఫిన్ తొలిసారిగా కనిపించిందని స్థానికులు తెలిపారు.

ఈనెల 20 నుంచి డాల్ఫిన్ల లెక్కింపు

భువనేశ్వర్: రాష్ట్రంలోని బిత్తర్‌కనికా జాతీయ పార్కు, గహిర్‌మత అభయారణ్యం, వీటి పరిసర సముద్ర ప్రాంతాల్లో డాల్ఫిన్లు లెక్కిస్తారు. రాష్ట్ర అటవీ శాఖ ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు ఈ ప్రాంతాల్లో డాల్ఫిన్ల గణన చేపడుతుందని రాజ్‌నగర్ డీఎఫ్‌వో సుదర్శన్ యాదవ్ గురువారం తెలియజేశారు. దామ్రా, దేవీ నదుల ముఖ ద్వారాలు (సముద్ర సంగమం) ప్రాంతాల్లో ఈ ప్రక్రియకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రంలో ఏటా డిసెంబర్ నెలలో డాల్ఫిన్ల గణన చేపడతారు. అయితే ఈ ఏడాది జనవరి మూడో వారంలో ఈ ప్రక్రియ ఆలస్యంగా ప్రారంభిస్తున్నారు. రాష్ట్రంలో ఐదు రకాల డాల్ఫిన్లు ఉన్నాయి. వీటిని సంతానం విస్తృతి అనుబంధ అంశాలతో గణన కొనసాగుతుంది. దీంతో రాష్ట్రంలో 5 రకాల డాల్ఫిన్ల సంతతి స్పష్టమైన వివరాలు తేటతెల్లం అవుతాయని డీఎఫ్‌వో వివరించారు. లెక్కింపు బృందాలకు గణన కార్యకలాపాలను సులభతరం చేసేందుకు కెమేరాలు, అధునాతన జీపీఎస్ వ్యవస్థ మరియు ఇతర పరికరాలు ఏర్పాటు చేశారు.

వారసత్వ ప్రాకారంలో 108 అడుగుల అగరుబత్తి



వారసత్వ ప్రాకారంలో ఉన్నటువంటి అగరుబత్తి

భువనేశ్వర్: పూరీ శ్రీమందిర్ వారసత్వ ప్రాకార ప్రాంగణంలో అత్యంత పొడవాటి అగరుబత్తి వెలుగుతోంది. ప్రాకార ప్రారంభోత్సవం పురస్కరించుకుని ఓ భక్తుడు 108 అడుగుల పొడవైన అగరబత్తిని వెలిగించాడు. తాల్చేర్ కనిహాకు చెందిన ప్రహ్లాద్ చంద్రసాహు తన చేతులతో గుగ్గిలం, చందనం ఇతరేతర సుగంధ ద్రవ్యాలతో ఈ అగరుబత్తిని తయారు చేశాడు. దీని పొడవు 108 అడుగులు, 1 అంగుళం వెడల్పు. ఒక అంగుళం పొడవు కలిగిన అగరబత్తి 45 నిమిషాలు నిరవధికంగా వెలుగుతూ సుగంధ ధూమం విడుదల చేస్తుందని ప్రహ్లాద్ చంద్రసాహు వివరించారు. ఈ లెక్కన భారీ అగరుబత్తి సుమారు నెల రోజుల పాటు మండుతుందని ఆయన భావిస్తున్నారు. 10 రోజులపాటు నిరవధికంగా శ్రమించి దీనిని తయారు చేశాడు. తయారు చేసిన భారీ అగరుబత్తిని రూ.30 వేలు వరకు వెచ్చించి శ్రీ మందిరం వారసత్వ ప్రాకారం ప్రాంగణానికి తరలించాడు.

ప్రారంభోత్సవానికి ఆహ్వానం



సేవాయత్‌లకు ఆహ్వానం పలుకుతున్న అధికారులు

పర్లాకిమిడి: ఈనెల 27న మా సమలై మందిర పరిక్రమ ప్రాజెక్టును లోకార్పణం చేయనున్న దృష్ట్యా సంబల్‌పూర్ నుంచి వచ్చిన సేవాయత్‌లకు గజపతి జిల్లా కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్, అదనపు కలెక్టర్ బీరేంద్రకుమార్ దాస్‌లు ఘన స్వాగతం పలికారు. వారు రామగిరిలో మాకురేసిన మందిరం, చంద్రగిరిలో జగన్నాథ మందిరం, ఆర్.ఉదయగిరిలో లుహాఖోంబ మందిర పూజార్లుకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. సంబల్‌పూర్ నుంచి వచ్చిన సేవాయత్‌లు దులాయి చంద్రరాయ్, కృష్ణచంద్ర రాయ్, శిశిరో రాయ్ సహా నోడల్ అధికారులు విచిత్రా నంద ఆచార్యలకు ఏడీఎం ఉత్తరీయం అందించి సత్కరించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సాధారణ సమావేశంలో డీఆర్‌డీఏ సీడీఎం గుణనిధి నాయక్, జిల్లా సాంస్కృతిక అధికారి అర్చనా మంగరాజ్, డీసీపీయూ అరుణ్ కుమార్ త్రిపాఠిలు పాల్గొన్నారు.

పూరీకి బస్సు సేవలు



మల్కన్‌గిరి: బస్సు ప్రారంభోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ విశాల్ సింగ్ తదితరులు

- 12 జిల్లాల నుంచి ప్రారంభించిన సీఎం నవీన్ పట్నాయక్



రాయగడ: జగన్నాథ బస్సు ప్రారంభిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: రాష్ట్రం నలుమూలల నుంచి పవిత్ర పుణ్యక్షేత్రం పూరీకి వచ్చిపోయేందుకు రాష్ట్ర ప్రభుత్వం బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించింది. ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన లొకేషన్ యాక్సెసబుల్ మల్టీ మోడల్ ఇనీషియేటివ్ (ఎల్ఏసీసీఎంఐ) కింద జగన్నాథ్ ఎక్స్‌ప్రెస్ బస్సు సేవలను ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ గురువారం ప్రారంభించారు. అన్ని జిల్లాల నుంచి పూరీకి జగన్నాథుని ఆలయ దర్శనం కోసం ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించడం ఈ బస్సు సేవల లక్ష్యంగా పేర్కొన్నారు. ఈనెల 17న పూరీలో ప్రారంభించిన శ్రీ మందిరం వారసత్వ ప్రాకారం సందర్శించేందుకు ప్రతిరోజూ దాదాపు 10,000 మంది యాత్రికులు తరలి వచ్చేందుకు ఏసీ సూపర్ డీలక్స్ జగన్నాథ్ ఎక్స్‌ప్రెస్ బస్సు సేవలు దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. తొలి దశలో 12 బస్సులు జిల్లా ప్రధాన కార్యాలయాల ప్రాంతాలు బొలంగీర్, బర్‌గఢ్, గంజాం, ఝార్సుగుడ, కొరాపుట్, కలహండి, మల్కన్‌గిరి, నవరంగ్‌పూర్, నువాపడా, రాయగడ, సంబల్‌పూర్ మరియు సుందర్‌గఢ్ నుంచి రాకపోకలు చేస్తాయి. తదుపరి దశల్లో 80 సూపర్ ప్రీమియం బస్సులతో మొత్తం 30 జిల్లాలకు జగన్నాథ ఎక్స్‌ప్రెస్ బస్సు సేవలు విస్తరిస్తారు. ఈ బస్సులు భువనేశ్వర్‌లో ఆగుతాయి.

మహిళలకు రాయితీ

మహిళలు శ్రీజగన్నాథుని దర్శనానికి పూరీ వెళ్లేందుకు ప్రత్యేక రాయితీ సదుపాయం కల్పించారు. ఈ నేపథ్యంలో మహిళలకు 50 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి టుకుని సాహు, ఎమ్మెల్యే భూపీందర్ సింగ్, అభివృద్ధి కమిషనర్ అనూ గర్గ్, వాణిజ్య మరియు రవాణా శాఖ ప్రధాన కార్యదర్శి ఉషా పాఢి, 5టీ చైర్మన్ వి.కె.పాండియన్ తదితరులు పాల్గొన్నారు.

రాయగడ: ఒడిశాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పూరీకి జైజగన్నాథ్ బస్సు సేవలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఈ మేరకు గురువారం సాయంత్రం 5.30 గంటలకు బస్ సేవలను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఈ బస్సులో 51 మంది ప్రయాణికులు ఒకేసారి ప్రయాణించవచ్చు. పూరీ పుణ్యక్షేత్రాన్ని దర్శించుకునేందుకు రాయగడ నుంచి నేరుగా ఈ బస్సులో ప్రయాణించవచ్చని ఆర్టీవో శివప్రసాద్ చౌదరి తెలియజేశారు. పురుషులకు రూ.1,093 టిక్కెట్టు ధర నిర్ధారించగా, మహిళలు, దివ్యాంగుల కోసం టికెట్టు ధరలో 50 శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి నిహారి రంజన్ కుహరో, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగో, జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్, సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రా దేవి తదితరులు పాల్గొన్నారు.

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రం నుంచి పూరీ పుణ్యక్షేత్రానికి కలెక్టర్ విశాల్‌సింగ్, చిత్రకొండ ఎమ్మెల్యే పూర్ణ చంద్ర బక్క ఆధ్వర్యంలో గురువారం బస్సు సేవలు ప్రారంభించారు. ఈ బస్సు ప్రతిరోజు మల్కన్‌గిరి నుంచి సాయంత్రం 6 గంటలకు బయల్దేరుతుంది. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వేద్బార్ ప్రధాన్, సబ్ కలెక్టర్ అక్షయ్‌కుమార్ ఖేముండు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ రుణం తీర్చుకోలేనిది



కార్యక్రమంలో మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం రూరల్:

ఆకాశమంత విగ్రహం తయారు చేసినా అంబేడ్కర్ రుణం తీర్చుకోలేమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. విజయవాడలోని అంబేడ్కర్ విగ్రహావిష్కరణ నేపథ్యంలో సామాజిక సమతా సంకల్ప కార్యక్రమాన్ని స్థానిక అంబేడ్కర్ ఆడిటోరియంలో గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విజయవాడలోని స్వరాజ్య మైదానంలో 19 ఎకరాల విస్తీర్ణంలో రూ.404 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సామాజిక న్యాయ శిల్పాన్ని ప్రతి ఒక్కరూ సందర్శించాలని పిలుపునిచ్చారు. ఎంతో స్ఫూర్తిని కలిగించేలా ఉత్తర, దక్షిణాది రాష్ట్రాలకు వారధిగా, ఆంధ్రప్రదేశ్ నడిబొడ్డున ఉన్న విజయవాడ నగరంలో సామాజిక న్యాయానికి నిలువెత్తు రూపంలా దర్శనమిస్తుందని తెలిపారు.

జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యున్నత రాజ్యాంగాన్ని రూపొందించిన భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నిర్దేశించిన మార్గంలో అంతా నడవాలని సూచించారు. హక్కులు, అభ్యున్నతి కోసం పాటుపడిన అంబేడ్కర్‌కు 206 అడుగుల ఎత్తైన విగ్రహం ఏర్పాటు చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం మంత్రి ధర్మాన ప్రసాదరావు పంపిన సందేశాన్ని చదివి వినిపించారు. సమాచార శాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ గొప్పదనం తెలిపే ఆయన జీవిత చరిత్ర, స్మృతివనం ఫొటోలతో కూడిన ఎగ్జిబిషన్‌ను ధర్మాన కృష్ణదాస్‌తో కలిసి ప్రారంభించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ డైరీని కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నేతలతో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో జిల్లా సాంఘిక, సంక్షేమ శాఖ ఉపసంచాలకులు విశ్వమోహన్‌రెడ్డి, బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ, డ్వామా పీడీ చిట్టిరాజు, దళిత సంఘ నాయకులు బొడ్డేపల్లి నర్సింహులు, పొన్నాడ రుషి, కళ్లేపల్లి రామ్‌గోపాల్, కంఠవేణు, ముంజేటి కృష్ణమూర్తి, బోనెల రమేష్, తైక్వాండో శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ నూతన అధ్యాయం

- రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రాష్ట్రంలో బీఆర్ అంబేడ్కర్ అతిపెద్ద విగ్రహావిష్కరణ మరో నూతన అధ్యాయం కానుందని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఆయన గురువారం అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించా రు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రపంచంలోనే అత్యంత పొడవైన అంబేడ్కర్ విగ్రహం స్టీల్, ఇత్తడి లోహాలతో తయారు చేసినట్లు పేర్కొన్నారు. ఐదేళ్ల కిందట వైఎస్ జగన్ తన పాదయాత్రలో మాట ఇచ్చారని, ఆ మేరకు విజయవాడ నది ఒడ్డున ఈ విగ్రహాన్ని ఏర్పాటుచేసి ఆవిష్కరించే కార్యక్రమం శుక్రవారం జరుగుతుందన్నా రు. భారతదేశాన్ని సరైన మార్గంలో నడిపించడానికి విధానాలను, చట్టాన్ని, రాజ్యాంగాన్ని తయారు చేసిన మహోన్నతమైన వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. ఆ కాలంలో సమాజాన్ని ముందుకు నడిపించడానికి రామాయణాన్ని, భారతాన్ని ప్రామాణికంగా తీసుకునేవారని, కానీ ఆధునిక భారతదేశాన్ని నడిపించడానికి అంబేడ్కర్ రాజ్యాంగాన్ని ప్రామాణికంగా తీసుకుంటున్నామని తెలిపారు. శుక్రవారం విజయవాడ జరగబోయే ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో తూర్పుకాపు, కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు పొన్నాడ రుషి, ఎస్సీ కమిషన్ మెంబర్ కంఠ వేణు, కల్లేపల్లి రాంగోపాల్, సాధు వైకుంఠరావు, బలగ గణపతిపట్నాయక్, జేఎం శ్రీనివాస్, టంకాల బాలకృష్ణ, గుంట జ్యోతి, యజ్జల గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 22న ఒంటిపూట సెలవు

భువనేశ్వర్: అయోధ్యలో రామ మందిరం ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 22న ఒంటిపూట సెలవు ప్రకటించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టులు ఒంటిపూట మూతపడతాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అయోధ్యలో రామ్ లల్లా ప్రాణ ప్రతిష్ఠ దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, రెవెన్యూ, మెజిస్ట్రియల్ కోర్టులు (ఎగ్జిక్యూటివ్) ఈనెల 22న ఒంటిపూట మూసివేయబడతాయని రెవెన్యూ, విపత్తు నిర్వహణ విభాగం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం మధ్యాహ్నం 2 గంటల వరకు మూసివేయబడతాయని ఈ ఉత్తర్వులు పేర్కొన్నాయి.

నవోదయ ప్రవేశ పరీక్ష రేపు

సరుబుజ్జిలి: వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశానికి సంబంధించి ప్రవేశ పరీక్ష ఈనెల 20న నిర్వహించనున్నట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ప్రవేశ పరీక్ష ఉదయం 11.30 నుంచి 1.30 వరకు నిర్వహిస్తామని, పరీక్ష కేంద్రానికి గంట ముందు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కోసం 8430 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్ష సమయంలో తమ ఆధార్‌కార్డు/ రెసిడెన్స్ ధ్రువీకరణ పత్రం, అట్ట, బ్లూ లేదా బ్లాక్‌పెన్‌తో హాజరు కావాలని సూచించారు.

కొబ్బరి క్షేత్రాల పరిశీలన



తోటలను పరిశీలిస్తున్న డీడీ సుజాత, వరప్రసాదరావు

కవిటి: మండలంలోని శిలగాం, భైరిపురం రెవెన్యూ గ్రామాల పరిధిలో కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు ద్వారా ఆర్‌అండ్‌ఆర్ పథకానికి ఎంపికైన కొబ్బరిక్షేత్రాల్ని హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ సుజాత గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొబ్బరి సస్యరక్షణలో అనుసరిస్తున్న విధివిధానాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆర్.భైరిపురంలో రైతులతో ముఖాముఖీ సమావేశంలో పలు సస్యరక్షణ, ఆధునిక పద్ధతుల్ని వివరించారు. కార్యక్రమంలో సీడీబీ డీడీ కుమార్‌వేలు, జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ ఆర్.వి.వి.ప్రసాద్, హెచ్ఓ పి.మాధవీలత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్, రైతులు పాల్గొన్నారు.

నేతాజీ స్కూల్ రిజిస్టర్ ప్రదర్శన



- ఈనెల 23 నుంచి మ్యూజియంలో ప్రదర్శించనున్న అధికారులు

భువనేశ్వర్: కటక్ నగరం ఒడియా బజార్‌లో నేతాజీ జన్మస్థలం మ్యూజియం గ్యాలరీలో నేతాజీ మరో మధుర జ్ఞాపకం ప్రదర్శనకు సిద్ధమవుతోంది. ప్రొటెస్టంట్ యూరోపియన్ స్కూల్ (ఇప్పుడు స్టువర్టు స్కూల్) అడ్మిషన్ రిజిస్టర్‌లో 167 నంబర్‌లో నమోదైన నేతాజీ సుభాష్ చంద్రబోస్ వివరాలు కలిగి ఉన్న దస్తావేజు లభ్యమైంది. దీనిని ఈ ఏడాది నేతాజీ జన్మదినం పురస్కరించుకుని ఈనెల 23వ తేదీన కటక్ ఒడియా బజార్‌లోని నేతాజీ జన్మస్థలం మ్యూజియం గ్యాలరీలో ప్రదర్శించనున్నారు. ఈ దస్తావేజుల సమాచారం ప్రకారం నేతాజీ సుభాష్ చంద్రబోసు జనవరి 8, 1902 నుంచి డిసెంబర్ 31, 1908 సంవత్సరం వరకు ఈ పాఠశాలలో తన ప్రాథమిక విద్యను పూర్తి చేశారు. రిజిస్టర్‌లో 1887 నుంచి 1935 సంవత్సరం వరకు ఈ విద్యా సంస్థలో చేరిన విద్యార్థుల పేర్లు వివరాలు ఉన్నాయి. ఈ రిజిస్టర్‌ని స్టువర్టు పాఠశాల అధికారులు అడ్మిషన్ రిజిస్టర్‌ను నేతాజీ జన్మస్థలం మ్యూజియం అధికారులకు అందజేశారు. మ్యూజియం నేతాజీ సుభాష్ చంద్రబోస్ పాఠశాల విద్యకు సంబంధించి స్థానిక రెవెన్షా కాలేజియేట్ స్కూల్ వర్గాల ఆధ్వర్యంలో లభించిన దస్తావేజు (రిజిస్టర్)ని మ్యూజియంలో భద్రపరిచి ప్రదర్శిస్తున్నారు. నేతాజీ ప్రాథమిక విద్యకు సంబంధించిన రికార్డు సమాచారం అందుబాటులో లేదు. తాజాగా స్టువర్టు స్కూల్ అధికారులు దానిని అందజేయడంతో ఈనెల 23న నేతాజీ జయంతి సందర్భంగా ఒకటో నంబర్ గ్యాలరీలో దీన్ని ప్రదర్శించనున్నట్లు మ్యూజియం క్యూరేటర్ ఇన్‌చార్జ్ జె.పి.రే తెలిపారు.

నాసిక్ యాత్రకు గిరిజన యువత



ప్రయాణానికి సిద్ధమవుతున్న యువతతో బీఎస్ఎఫ్ జవాన్లు

మల్కన్‌గిరి: జిల్లాలోని బీఎస్ఎఫ్ జవాన్లతో ఈనెల 20వ తేదీన గిరిజన యువత నాసిక్ యాత్రకు వెళ్లనున్నారు. ఈసారి చిత్రకొండ సమితి ఖజూరకూడ, అజారిగూడ, లభాసింగ్, రగిణిగూడ, సిలిగుమ్మకు చెందిన 20 మంది యువతను ఎంపిక చేశారు. 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు వీరిని నాసిక్, తిరువనంతపురంలో పర్యాటక ప్రదేశాలు, సినీ ప్రముఖులు, రాజకీయ నేతలు తదితరులతో కలిపించనున్నట్లు బీఎస్ఎఫ్ఐజీ సైలేంద్ర సిన్హా తెలియజేశారు. వీరితో పాటు ముగ్గురు జవాన్లు వెళ్లనున్నారు. వీరి ఖర్చులను బీఎస్ఎఫ్ జవాన్లు భరిస్తారు.

కుల గణనపై సర్వత్రా హర్షం



పోతయ్యవలసలో సీఎం వైఎస్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

నరసన్నపేట: ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో శుక్రవారం నుంచి కుల గణనను ప్రభుత్వం చేపట్టడాన్ని స్వాగతిస్తూ అన్ని కులాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఏ కులం జనాభా ఎంత ఉందనేది దీని ద్వారా స్పష్టం అవుతుందని, ఇలాంటి సాహసోపేత నిర్ణయం తీసుకొని పక్కాగా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అన్ని కులాల వారు అభినందిస్తున్నారు. పోతయ్యవలసలో అరవకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సీఎం చిత్ర పటానికి గురువారం క్షీరాభిషేకం చేశారు. అరవకుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రతినిధి కనపల అరవిందు నాయుడు మాట్లాడుతూ తమలాంటి చిన్నకులాలకు ప్రభుత్వం ఎంతో గుర్తింపు నిచ్చిందని, ఇప్పుడు చిన్న కులాల జనాభా కూడా స్పష్టంగా నిర్ధారణ కానుందని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కులాలతో పాటు అన్ని వర్గాలు ముఖ్యమంత్రికి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కర్రి సురేష్, అరవల రాజా, గదిలి రామ్మోహన్, ఎలిపోతు కృష్ణారావు, అరవల శ్రీనివాస్, అరవల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో ముందుకువెళ్దాం



బాధ్యతలు స్వీకరిస్తున్న వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని

- ప్రొఫెసర్ కేఆర్ రజిని
- బీఆర్ఏయూ నూతన వీసీగా బాధ్యతల స్వీకరణ

ఎచ్చెర్ల క్యాంపస్: సమష్టి కృషితో వర్సిటీని ముందుకు తీసుకెళ్దామని బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ నూతన వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని పిలుపునిచ్చారు. ఆమెకు గురువారం వర్సిటీలో ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం ఆమె బాధ్యతలు స్వీకరించారు. అంబేడ్కర్ వంటి మహనీయుని పేరుపై ఉన్న విశ్వ విద్యాలయానికి వీసీగా బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రమాణాలతో కూడిన విద్య అందించటం, వర్సిటీ ద్వారా ప్రాంతీయ అభివృద్ధి లక్ష్యం పనిచేస్తామని వెల్లడించారు. కుల, మత , వర్గ, రాజకీయాలకు ఇక్కడ తావు ఉండదని, వర్సిటీ అనే కుటుంబంలో ప్రతి ఉద్యోగి చిత్తశుద్ధి, అంకిత భావం, నిజాయితీగా పనిచేయాలని తెలిపారు. మంచి ఫలితాలు రావాలంటే అకడమిక్ కరిక్యులమ్‌లో మార్పులు అవసరమని చెప్పారు. అనంతరం వర్సిటీలో అన్ని విభాగాల పరిస్థితి, పరిపాలన, భవన నిర్మాణాలు వంటి అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో వర్సిటీని ప్రగతి పథంలో నడిపిస్తానని, వర్సిటీలో మహిళా సాధికారితకు కృషిచేస్తున్నట్లు వివరించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, అధికారులు, సిబ్బంది వీసీకి అభినందనలు తెలిపారు.

● గురుభ్యో నమః





ఈ వాహనంపై ఉన్నవారంతా ఉపాధ్యాయులు. బుడితి జిల్లా ఉన్నత పాఠశాలలో ఒకప్పుడు పని చేశారు. ఈ బడిలో 1991-92లో పదో తరగతి చదివిన వారు గురువారం ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులను కార్యక్రమానికి స్వాగతించి ఇలా అపురూప రీతిలో గౌరవించారు. బుడితి మార్కెట్ జంక్షన్ నుంచి పూలతో అలంకరించిన ప్రత్యేక వాహనంలో ఊరేగించి పాఠశాల ఆవరణ వరకు తీసుకెళ్లి సత్కరించారు. ఆనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుని సందడిగా గడిపారు.

- సారవకోట

క్లుప్తంగా

వైభవంగా పార్వేట ఉత్సవం



ఉత్సవమూర్తులను తిరువీధిగా తీసుకెళ్తున్న భక్తులు

జామి: మండలంలోని అన్నంరాజుపేట పంచాయతీ పుష్పగిరిలో వేణుగోపాలస్వామివారి పార్వేట ఉత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఫనిహారం సీతారామాచార్యులు, ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని అలంకరించి ఉత్సవమూర్తులను తిరువీధి జరిపారు.

సురక్షిత ప్రయాణ బాధ్యత డ్రైవర్లదే

- ఆర్టీసీ డిప్యూటీ సీఎంఈ కె.శ్రీనివాసరావు



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఆర్టీసీ డిప్యూటీ సీఎంఈ కె.శ్రీనివాసరావు

విజయనగరం అర్బన్: రోడ్డు రవాణాలో ప్రమాదరహిత, సురక్షిత ప్రయాణానికి డ్రైవర్లు కీలక బాధ్యత వహించాలని ఆర్టీసీ డిప్యూటీ సీఎంఈ కె.శ్రీనివాసరావు అన్నారు. రహదారి భద్రతామాసోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ స్టాఫ్‌శిక్షణ కళాశాలలో డ్రైవర్లు, మెకానిక్, ఎలక్ట్రీషియన్స్‌కు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు విధి నిర్వహణ సమయంలో ప్రశాంతత పాటిస్తే ప్రమాదరహిత రవాణా సేవలను అందించగలుగుతామని సూచించారు. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం నుంచి ఈనెల 24 వరకు బస్సుల నిర్వహణ, 25 నుంచి 28 వరకు ఫ్యామిలీ కౌన్సెలింగ్, 29 నుంచి 31వ తేదీ వరకు సెఫ్టీ డ్రైవింగ్ అలవెన్స్, వచ్చే నెల 1 నుంచి 5 వరకు వైద్య పరీక్షలు, 6 నుంచి 19వ తేదీ వరకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు, 10న రక్తదాన శిబిరం, 11 నుంచి 13 వరకు ప్రమాదాలపై ఆడిట్, 14న ఉత్తమ డ్రైవర్ల అవార్డులతో సత్కరిస్తామని తెలిపారు. ఈనెల 24న డ్రైవర్స్ డే ఉత్సవాలను అన్ని డిపో కేంద్రాలు, బస్ స్టేషన్లలో నిర్వహిస్తామన్నారు. శిక్షణ కార్యక్రమంలో జోన్-1 పరిధిలోని డ్రైవర్లు, మెకానిక్స్, ఎలక్ట్రీషియన్లు పాల్గొన్నారు.

శాంతియుత జీవనమే శ్రేయస్కరం



లక్ష్మీపేటలో దళితులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్, ఆర్డీఓ

వంగర: ప్రజలు శాంతియుతంగా జీవించాలని ట్రైనీ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, చీపురుపల్లి ఆర్డీఓ బి.శాంతి కోరారు. మండలంలోని లక్ష్మీపేటను గురువారం సందర్శించారు. మూడు రోజుల కిందట ఎస్సీ, బీసీ వర్గీయుల మధ్య జరిగిన తగాదాలో నమోదైన అట్రాసిటీ కేసు అంశంపై ఇప్పటికే డీఎస్పీ ఎ.ఎస్.చక్రవర్తి దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో ట్రైనీ కలెక్టర్, ఆర్డీఓలు గ్రామాన్ని సందర్శించారు. ఘటనకు గల కారణాలను బాధితుడు చిత్తిరి దుర్గాప్రసాద్‌ను అడిగితెలుసుకున్నారు. 2012లో తమ గ్రామంలో జరిగిన ఘటన అనంతరం నాలుగు కుటుంబాలకు చెందినవారు ఉద్యోగాలకు దూరమయ్యారని, ఉపాధి పొందేందుకు కొంత భూమిని కేటాయించాలని దళితులు కోరారు. అనంతరం ఇక్కడ ఏర్పాటు చేసిన కోర్టు భవనాలు, ప్రత్యేక పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.ఐజాక్, ఎస్‌ఐ వై.వి.జనార్దన్ పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

రేగిడి: మండలంలోని అంబఖండి గ్రామంలో పేకాట శిబిరంపై రేగిడి ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావుతో పాటు సిబ్బంది గురువారం దాడిచేశారు. ఐదుగురు జూదారులను అరెస్టుచేయడంతో పాటు రూ.19,860లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

భోగాపురం: మండలంలోని రెడ్డికంచేరు-లింగాలవలస కూడళ్ల వద్ద ఎస్‌ఐ సూర్యకుమారి సిబ్బందితో కలిసి గురువారం వాహన తనిఖీ చేశారు. ఆ సమయంలో ఎటువంటి అనుమతులు లేకుండా ద్విచక్ర వాహనాలపై అక్రమంగా మద్యం తరలిస్తున్న చుక్కరాజు, సి.చంద్రరావు అనే ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 37 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

11 మద్యం బాటిళ్లు స్వాధీనం

సంతకవిటి: మండల పరిధి శ్రీహరినాయుడుపేట కూడలి దగ్గర గురువారం హెడ్ కానిస్టేబుల్ ప్రసాదరావు తన సిబ్బందితో తనిఖీలు చేశారు. పోతులజగ్గుపేట గ్రామానికి చెందిన వ్యక్తినుంచి 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదుచేశారు.

అగ్రిపథాన అతివలు

చదువుకున్నవారు ఎవరైనా కడుపులో చల్ల కదలకుండా ఉండే ఉద్యోగాన్ని కోరుకోవడం సహజం. ఇందులో మహిళలైతే కార్యాలయాలు కదలని ఉద్యోగాలనే ఎంపిక చేసుకోవడం పరిపాటి. కానీ.. వీరు అలాకాదు. చెట్టూపుట్టా దాటుకుంటూ పొలాల్లో తిరుగుతూ పనిచేసేందుకు ఇష్టపడుతున్నారు. పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో ఉంటామని ధైర్యంగా చెప్పడమే కాదు.. ఆచరణలో నిరూపిస్తున్నారు. ఇబ్బందులకు మారుపేరైన వ్యవసాయరంగలోనూ తమకెవరూ చాటిరారని చాటిచెబుతున్నారు. విత్తన సరఫరా నుంచి పంట చేతికొచ్చే వరకు రైతన్నకు వెన్నుదన్నుగా నిలుస్తూ సాగును లాభాలబాట పటించడంలో తమదైన ముద్రవేస్తున్నారు. మహిళా వీహెచ్‌ఏలు, వీఏఏల సాగు కృషికి 'సాక్షి' అక్షర రూపం.

- రైతులకు చేదోడువాదోడుగా నిలుస్తున్న మహిళా వీహెచ్‌ఏలు, వీఏఏలు
- ఉత్సాహంగా విధి నిర్వహణ
- వ్యవసాయాధికారులుగా రాణింపు
- రైతన్నకు వెన్నుదన్నుగా నిలుస్తున్న మహిళా వ్యవసాయ, ఉద్యానవన ఉద్యోగులు



గొల్లలపేటలో వేపాకు కషాయం తయారీ విధానాన్ని రైతులకు తెలియజేస్తున్న లావణ్య

రామభద్రపురం:

వ్యవసాయం అంటే.. ఓ వ్యాపకం. ఎండా వానా లెక్కచేయకుండా.. ఆరుగాలం పొలంలో శ్రమించాలి. పంట విత్తిన నుంచి మార్కెట్‌కు తరలించేవరకు ప్రతీ పనిని చిత్తశుద్ధితో నిర్వర్తించాలి. ఇష్టంగా సాగాలి. సీజన్‌వారీగా మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు సాగుచేయాలి. అప్పుడే వ్యవసాయం లాభసాటిగా మారుతుందన్నది వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు చెప్పేమాట. దీనిని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అక్షరాలా ఆచరణలోకి తెచ్చింది. వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. ఏటా ఠంచన్‌గా పెట్టుబడి సాయం అందించడంతో పాటు రైతన్నకు వెన్నుదన్నుగా నిలిచేలా గ్రామ స్థాయిలో ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. సుమారు ఐదేళ్లుగా రైతుభరోసా కేంద్రాల ద్వారా విత్తన సరఫరానుంచి పంట విక్రయం వరకు చేదోడువాదోడును అందిస్తోంది. వ్యవసాయ సిబ్బంది కృషితో ప్రభుత్వ ఆశయం నెరవేరుతోంది.

జిల్లా	పనిచేస్తున్న వీహెచ్‌ఏలు, వీఏఏలు	వీరిలో మహిళలు
పార్వతీపురం మన్యం	412	164
విజయనగరం	472	250

రైతన్నకు అండగా...

ఐదేళ్ల కిందటి వరకూ వ్యవసాయ శాఖలో ఉద్యోగమంటేనే యువతులు, మహిళలు ఆమడ దూరాన ఉండేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం అన్నదాతకు అన్ని విధాలా అండగా నిలవాలన్న ఉద్దేశంతో గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యాన సహాయకుల పోస్టులను భర్తీచేశారు. ఇందులో ఉమ్మడి విజయనగరం జిల్లాలో 40 శాతం పోస్టులను మహిళలే సొంతం చేసుకున్నారు. విధుల్లో ఉత్సాహంగా సాగుతూ... రైతులను సాగులో చైతన్యపరుస్తున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే సాగు పద్ధతులను విడమర్చి చెబుతున్నారు. ఏ సీజన్‌లో ఏ పంట వేయాలో క్యాలెండర్ ప్రకారం వివరిస్తున్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటల వివరాలు తెలియజేస్తున్నారు. సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహిస్తున్నారు. మోతాదుకు మించి రసాయనిక ఎరువుల వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలను శాస్త్రోక్తంగా వివరిస్తున్నారు. పంటలను ఆశించే చీడపీడలను నివారించే కషాయాల తయారీని ప్రయోగాత్మకంగా తెలియజేస్తున్నారు. విపత్తుల వేళ రైతులను అప్రమత్తం చేస్తున్నారు. పొలాలకు వెళ్లి పంటను రక్షించే చర్యలపై సూచనలిస్తున్నారు. అందరికీ అన్నంపెట్టే రైతన్నకు సేవచేయడంలో అసలైన ఆత్మసంతృప్తి ఉందని, అందుకే... ప్రభుత్వం కల్పించిన ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నామని సంతోషంగా చెబుతున్నారు.



రామభద్రపురంలో పొట్టి చిక్కుడు సాగు సస్యరక్షణపై అవగాహన కల్పిస్తున్న హైమావతి



రొంపల్లిలో రైతుల ధాన్యం కొనుగోలుకు సిద్ధం చేయిస్తున్న శాంతి

సాగుపై మక్కువ కలిగేలా...



నేను హార్టికల్చర్ బీఎస్సీ చేశాను. మాది వ్యవసాయ కుటుంబం కావడంతో ఈ రంగంపై అవగాహన ఉంది. ఆరికతోట ఆర్‌బీకేలో ఉద్యోగం రాగానే ఆనందం కలిగింది. ఫీల్డ్‌కు వెళ్లినప్పుడు 10 నుంచి 50 మంది రైతులను కలుస్తాను. సాగుపై ఆసక్తి కలిగేలా సూచనలు ఇస్తుంటాను. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి వచ్చే మార్గాలు సూచిస్తుంటాను. పనిలో నిజాయితీ ఉన్న రైతులు మా మాటలు బాగా ఒంటబట్టించుకుంటారు. రైతులకు సహాయపడడంలో ఉద్యోగపరంగా సంతృప్తిగా ఉంది.

– కేతిరెడ్డి సంధ్య, గ్రామ ఉద్యానసహాయకురాలు, ఆరికతోట



మిర్తివలసలో కోకో గ్రేడింగ్‌పై అవగాహన కల్పిస్తున్న స్వాతి



అప్పలరాజుపేటలో రైతుకు ఈకేవైసీ చేస్తున్న లావణ్య

ఇదో గొప్ప అవకాశం..



మాది పార్వతీపురం మన్య జిల్లా సీతానగరం మండలంలోని ఇప్పలవలస. వ్యవసాయ కుటుంబం. వ్యవసారంగం అంటే మక్కువ. రైతన్నకు ఉపయోగపడాలన్న ఉద్దేశంతో హార్టికల్చర్ విభాగంలో డిప్లమో చేశాను. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం భర్తీచేసిన గ్రామ ఉద్యాన సహాకుల నియామకాల్లో గ్రామ ఉద్యానశాఖ సహాయకురాలి(వీహెచ్‌ఏ)గా ఉద్యోగం పొందాను. ఇదే మొదటి ఉద్యోగం కావడంతో సవాలుగా తీసుకున్నాను. రైతన్నకు సేవ చేసేందుకు గొప్ప అవకాశం వచ్చిందనుకున్నా. రామభద్రపురం మండలం కొట్టక్కి ఆర్‌బీకేలో పోస్టింగ్ వచ్చింది. అధికారుల సూచనల మేరకు పొలాలకు వెళ్లి రైతన్నకు వ్యవసాయ పరిజ్ఞానాన్ని అందిస్తున్నాను. పుస్తకాల్లో ఉన్న శాస్త్రోక్త పద్ధతులను విడమర్చి చెబుతున్నా. నేను ఇచ్చే సలహాలు పాటించడం వల్ల పంట కలిసివచ్చే సమయంలో ఆ రైతులు తమపై చూపే అభిమానం వెలకట్టలేనిది. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్న లక్ష్యంతోనే ముందుకు సాగుతున్నా.

– ఉడమల స్వాతి, గ్రామ ఉద్యాన సహాయకురాలు, కొట్టక్కి

కష్టమైనా ఇష్టపడే వచ్చా...



నేను రొంపల్లి ఆర్‌బీకేలో పనిచేస్తున్నాను. 2019లో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి దయతో గ్రామ వ్యవసాయ సహాయకురాలిగా ఉద్యోగం పొందాను. ఇష్టపడిన వ్యవసాయ రంగంలో పోస్టు రాగేనే చాలా సంతోషం కలిగింది. రైతుకు సేవ చేయడానికి దొరికిన అవకాశంగా ఫీలవుతున్నాను. రైతులు ఎంతో కష్టపడితేనే మనమంతా ఇంత సుఖమైన జీవితం అనుభవిస్తున్నామని తెలుసుకోవాలి. అటువంటి వారికి తోడ్పడుతుంటే చాలా తృప్తిగా ఉంటుంది. ఈ రంగంలో మగవారితో దీటుగా పని చేయాలనే దీక్షతో పనిచేస్తున్నా. ఫీల్డ్‌లో రైతులను కలిసి వారికి అర్థమయ్యే వరకు ఓపికగా సాగుపై అవగాహన కల్పిస్తున్నాను. ప్రభుత్వం కల్పించిన ఉద్యోగం ఆత్మసంతృప్తినిస్తోంది.

– కె.విజయలక్ష్మి, వ్యవసాయ సహాయకురాలు, దుప్పలపూడి

నేడు అంబేడ్కర్ విగ్రహాలకు క్షీరాభిషేకాలు

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పిలుపు



విజయనగరం: సామాజిక సమతామూర్తి, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారీ కాంస్య విగ్రహాన్ని విజయవాడ స్వరాజ్యమైదానంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేయాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు గురువారం పిలుపునిచ్చారు. సచివాలయ స్థాయి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో కూడా పెద్ద ఎత్తున క్షీరాభిషేకాలు నిర్వహించాలని, ఈ కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. అంబేడ్కర్ ఆశయాల సాధనే లక్ష్యంగా, సామాజిక సాధికారత వైపు రాష్ట్రాన్ని నడిపించిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహనరెడ్డి, బాబాసాహెబ్‌కు ఘనంగా నివాళులర్పిస్తూ ఆ మహనీయుని 206 అడుగుల భారీ విగ్రహాన్ని విజయవాడలో ఆవిష్కరించనున్నారని తెలిపారు. రాష్ట్ర చరిత్రలో ఇదొక మహత్కార్యమని, దీనిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. అంబేడ్కర్ భావజాలం కేవలం భారతదేశానికే కాదు, యావత్ ప్రపంచానికి స్ఫూర్తిదాయకమన్నారు. బడుగు, బలహీన వర్గాలకే కాదు సామాజిక సమతుల్యతను, వారి అభ్యున్నతిని కోరుకొనే ప్రతిఒక్కరికీ అంబేడ్కర్ ఆశయాలు శిరోధార్యమని పేర్కొన్నారు.

ఘనంగా కోరుకొండ సైనిక్ స్కూల్ ఆవిర్భావ దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.శాస్త్రి, అధికారులు, విద్యార్థులు

విజయనగరం రూరల్: కోరుకొండ సైనిక పాఠశాల 62వ ఆవిర్భావ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్.ఎస్.శాస్త్రి కేక్ కట్‌చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాల ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు దేశ రక్షణ రంగంలో సుమారు 700 మంది సైనిక అధికారులను అందించిన ఘనత కోరుకొండ సైనిక పాఠశాలకు దక్కడం గర్వకారణమన్నారు. సైనిక పాఠశాలలో విద్యనభ్యశించిన వేలాది మంది విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా నేడు అత్యున్నత స్థాయిలో ఉన్నారని కొనియాడారు. దేశంలో ఉన్న 33 సైనిక పాఠశాలలో కోరుకొండ సైనిక పాఠశాల ముందు వరుసలో నిలవడం ఆనందంగా ఉందని తెలిపారు. సౌకర్యాలు, శిక్షణ పరంగా, ఉత్తమ విద్యాబోధన అందించడంలో పాఠశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది అందిస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. భవిష్యత్తులో సైనిక పాఠశాల అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దుబాయి నుంచి మృతదేహం తరలింపు



బంగారునాయుడు (ఫైల్)

జామి: ఉపాధి కోసం దుబాయి వెళ్లిన జామి గ్రామానికి చెందిన బంగారు నాయుడు(37) గతనెల 30న మృతిచెందాడు. వార్త తెలిసినప్పటి నుంచి మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకురావాలని మృతుని భార్య కొండమ్మ అధికారులకు విన్నవించుకుంది. తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. దీంతో దుబాయి నుంచి గురువారం సాయంత్రం విశాఖపట్నం విమానశ్రాయానికి విమానంలో మృతదేహాన్ని తరలించారు. వీఆర్వో హరికృష్ణ, మృతుని కుటుంబ సభ్యులు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బందారు పెదబాబు విమానాశ్రయానికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. జామికి తీసుకొచ్చారు. మృతదేహం అప్పగించేందుకు కృషిచేసిన అధికారులకు మృతుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



విశాఖ విమానశ్రయం వద్ద బంగారునాయుడు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుంటున్న వీఆర్వో, మృతుడి కుటుంబ సభ్యులు

దొరికితే అప్పగించండి

సీతానగరం: మండలంలోని జోగింపేట గ్రామానికి చెందిన కొప్పర సుబ్బమ్మ పోస్టల్ ఎఫ్‌డీ బాండ్స్‌తో ఉన్న బ్యాగ్‌ను సీతానగరం-జోగింపేట గ్రామాల మధ్య రాష్ట్ర రహదారిలో జారవిడిచింది. పోస్టాఫీస్‌కు వెళ్తూ బ్యాగ్‌ను పోగొట్టుకున్నానని, ఎవరికి దొరికినా అప్పగించాలని పత్రికాముఖంగా వేడుకుంది. బ్యాగ్‌లో ఆధార్‌కార్డు, పాన్ కార్డు, పోస్టాఫీస్‌లో ఎఫ్‌డీ చేసిన 10 బాండ్స్ ఉన్నాయన్నారు. బ్యాగ్ దొరికిన వారు సెల్: 9908811992కు సమాచారం ఇవ్వాలని కోరారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేస్తానన్నారు.

టెన్నీకాయిట్ విజేత ప్రవల్లిక



ప్రవల్లికను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, తదితరులు

చీపురుపల్లి: ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న ఎం.ప్రవల్లిక జాతీయస్థాయి టెన్నీకాయిట్ పోటీల్లో విజేతగా నిలిచింది. ఇటీవల శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగిన 47వ జాతీయస్థాయి టెన్నీకాయిట్ పోటీల్లో చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ద్వితీయస్థానం సాధించి మంచి పేరు ప్రఖ్యాతలను తీసుకువచ్చిన ప్రవల్లికను కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.వి.కృష్ణాజీ, వైస్ ప్రిన్సిపల్ డా.రమేష్‌కుమార్, జ్వాలముఖి, ఉపాధ్యాయ సిబ్బంది గురువారం అభినందించారు.

అధ్యాపకులకు పరిశోధనా పత్రాలు తప్పనిసరి

- సెంచూరియన్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి



మాట్లాడుతున్న సెంచూరియన్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి

నెల్లిమర్ల రూరల్: ప్రతి అధ్యాపకుడు తప్పనిసరిగా పరిశోధనా పత్రాలు సమర్పించాలని సెంచూరియన్ విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీలో పరిశోధన, పరిశోధనా పత్రాల తయారీ అనే అంశంపై ఏర్పాటు చేసిన కార్యశాలను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పల్లవి మాట్లాడుతూ... దేశంలో ఉత్తమ నైపుణ్య విద్యలో ప్రత్యేక గుర్తింపు సాధించామన్నారు. నాక్ గుర్తింపునకు పరిశోధనా పత్రాలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ విజయ్‌బాబు, డీన్లు పీఎస్వీ రమణారావు, ఎంఎల్ఎస్ ఆచార్యులు, సన్నీ డియోల్, మురళీ, అధ్యాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ చర్యలతో... సజావుగా సంక్రాంతి

- అసాంఘిక కార్యకలాపాలపై కొరడా
- 1915 లీటర్ల సారా ధ్వంసం
- పేకాటలో 239 మందికి పైగా అరెస్ట్
- రూ.8,59,931 నగదు స్వాధీనం
- కోడిపందాలాడుతున్న 59 మందిపై కేసులు
- డ్రంక్ అండ్ డ్రవ్‌లో పట్టుబడిన 130 మంది మందుబాబులు
- ఎల్‌హెచ్‌ఎమ్‌ఎస్ యాప్‌తో ఇళ్లల్లో దొంగతనాలకు చెక్



కొత్తవలస చిన్నమన్నిపాలెం, వియ్యంపేట శివారులో సారా, బెల్లం ఊటలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

విజయనగరం క్రైమ్: ప్రజలకు హాని కలిగించే అసాంఘిక శక్తులను చెక్ పెట్టేందుకు జిల్లా పోలీస్‌శాఖ చేపట్టిన ప్రణాళికలు సత్ఫలితాలనిచ్చాయి. రోడ్డు ప్రమాదాలను తగ్గించగలిగాయి. సంక్రాంతి పండగను జిల్లా ప్రజలు ప్రశాంతవాతావరణంలో సంతోషంగా నిర్వహించుకునేలా చేశాయి. జనవరి ఒకటో తేదీ నుంచి పోలీసులు విస్తత తనిఖీలు చేపట్టారు. మందుబాబులపై కొరడా ఝుళిపించింటారు. పేకాట శిబిరాలపై దాడులు చేశారు. కోళ్లపందాలు ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. లక్షల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. సారా బట్టీలను ధ్వంసం చేశారు. ఐఎంఎఫ్‌ఎల్, బెల్లం ఊటలను నాశనం చేశారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పండగను ప్రశాంతంగా నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేసి, సఫలీకృతులయ్యారు. పండగరోజుల్లో ఇళ్లల్లో దొంగతనాలు జరగకుండా పోలీసు శాఖ లాక్డ్ హౌస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎమ్‌ఎస్) యాప్ ప్రవేశపెట్టడంతో ఒకటిరెండు చోట్ల తప్పితే దొంగతనాలకు సంబంధించి కేసులు నమోదు కాకపోవడం గమనార్హం.

ఈ నెలలో ఇప్పటివరకు పోలీస్ చర్యలు ఇలా...

- సారా (ఐడి అరాక్)కి సంబంధించి ఐదు కేసులు నమోదుచేసి 65 లీటర్లు స్వాధీనం చేసుకున్నారు. బెల్లం ఊటలు (ఎఫ్‌జె వాష్) 1850 లీటర్లను ధ్వంసం చేశారు.
- ఎక్సైజ్‌కు సంబంధించి 254 కేసులు నమోదు చేసి 250 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఐఎంఎఫ్‌ఎల్ (మద్యం సీసాలు) 1176.84 లీటర్లు స్వాధీనం చేసుకున్నారు. 12 వాహనాలు సీజ్ చేశారు. పేకాట శిబిరాలపై దాడులు చేసి 20 మందిపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదుచేశారు. పెట్టీ కేసులు 31 పెట్టారు. 239 మందిని అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 51 కేసులకు సంబంధించి రూ. 8లక్షల59వేల 931 నగదు స్వాధీనం చేసుకున్నారు. కోడిపందాలు ఆడుతున్న ఆరుగురిపై కేసులు నమోదుచేశారు. 7 పెట్టీ కేసులు పెట్టారు. 59 మందిని అరెస్టు చేశారు. రూ.76,040 నగదు, 59 కోళ్లు స్వాధీనం చేసుకున్నారు.
- జనవరి ఒకటో తేదీ నుంచి సంక్రాంతి, కనుమ, ముక్కనుమ పర్వదినాల్లో కుటుంబాలతో సరదగా గడపాల్సిన వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలకు గురై, వారి కుటుంబాల్లో విషాదం లేకుండా చూడాలనే సదుద్దేశంతో డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన 269 మందిపై కేసులు నమోదుచేశారు. బహిరంగ మద్యం సేవిస్తున్న 375 మందిపై కేసులు పెట్టడంతో మందుబాబుల ఆగడాలకు అడ్డుకట్టవేయగలిగారు.

నిరంతర నిఘాతో ప్రశాంతంగా పండగ



పోలీస్ శాఖ సమష్టి కృషితో నిరంతర నిఘాతో సంక్రాంతి పండగను ప్రశాంతంగా నిర్వహించుకోగలిగాం. జిల్లా వ్యాప్తంగా సారా, మద్యం అక్రమంగా తరలిస్తున్నవారిపై నిఘాపెంచి అరెస్టు చేశాం. కోడిపందాలు, పేకాట శిబిరాలపై దాడులు విస్తతం చేయడంతో పాటు బహిరంగంగా మద్యం సేవించడం, డ్రంక్ అండ్ డ్రైవ్‌ను అరికట్టడం వల్ల రోడ్డు ప్రమాదాలు సాధ్యమైనంత వరకూ అరికట్టగలిగాం. కుటుంబాలతో పండగ ఆనందంగా నిర్వహించుకునేలా చేయడంలో తమవంతు బాధ్యత నేరవేర్చగలగడం సంతృప్తినిచ్చింది. ఇళ్లకు లాక్ చేసుకుని వెళ్లే వారికి లాక్‌హౌస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా రక్షణ కల్పించడంతో దొంగతనాలు ఆపగలిగాం.

– ఎం.దీపిక, ఎస్పీ, విజయనగరం